



గాంధారిలో అఖిలపక్ష ధర్నాలో పాల్గొన్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్, రైతులు

# రుణమాఫీ చేయకుంటే
# అసెంబ్లీ ముట్టడి

- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్
- గాంధారిలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా
- కాంగ్రెస్ హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్

గాంధారి, సెప్టెంబర్ 30 : అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, వాటన్నింటినీ అమలు చేయాల్సిందేనని అఖిల పక్ష నేతలు, రైతులు డిమాండ్ చేశారు. ప్రధానంగా రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతుభరోసా పథ కాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. లేకపోతే అసెం బ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధారిలో సోమవారం అఖిలపక్ష నేతలు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి విఫల మయ్యారని విమర్శించారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రజలను మోసగించింద న్నారు. అక్టోబర్ 10 లోపు రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, అసెంబ్లీతో పాటు సీఎం రేవంత్ ఇంటిని ముట్టడి స్తామని హెచ్చరించారు. సగం మందికి రైతు లకు రుణమాఫీ కాలేదని, ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందలేదన్నారు. రైతు కూలీలకు రూ.12వేలు, మహిళలకు రూ.4వేల పింఛన్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వకుండా మోసగించార న్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా, హైడ్రా పేరుతో హైడ్రామాలు ఆడుతున్నారన్నారు. హైడ్రా పేరుతో హైదరా బాద్‌లో నిరుపేదల ఇండ్లను కూలగొడుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. చెరువులో ఉన్న తన అన్న తిరుపతిరెడ్డి ఇంటిని కూల గొట్టాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిలో అభివృద్ధి పనులు జరుగడం లేదని, తన హయాంలో బుగ్గరామన్న ఆలయ సమీపంలో రూ.14 కోట్లతో రోడ్డు విస్తరణ పనులను చేప డితే, ప్రస్తుతం దానిపై డాంబర్ కూడా వేయలేదని విమ ర్శించారు. దాదాపు రెండు గంటలకు పైగా నిర్వహించిన ధర్నాతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో ఆందోళన విర మించారు. ధర్నాలో అఖిలపక్ష నాయకులు పొతంగల్ కిష న్‌రావు, మోజీరాంనాయక్, శివాజీరావు, సత్యంరావు, పెద్ద బూరీ సత్యం, సాయిబాబ, మధుసూదన్‌రావు, రెడ్డిరాజు, సయ్యద్ ముస్తాఫా, ముచ్చర్ల శ్రీకాంత్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయ భవన ప్రారంభోత్సవంలో మంత్రి, కలెక్టర్‌తో ముత్యాల సునీల్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి



### వారిదే హవా..

బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, భీమ్‌గల్ మండలాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ బిల్డింగ్‌లను ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సహకార శాఖ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డితో కలిసి ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అయితే, ఈ సందర్భంగా కొందరు కాంగ్రెస్ నేతల శైలి విమర్శలకు తావిచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన వారే మంత్రి పర్యటనలో హల్‌చల్ చేయడం చూసిన వారిని ముక్కున వేలేసుకునేలా చేసింది. బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ లీడర్లు స్వయంగా మంత్రితో కలిసి ప్రారంభోత్సవాల్లో పాలు పంచుకున్నారు. ఆర్మూర్‌లో జరిగిన కార్యక్రమంలోనూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన వినయ్‌రెడ్డి పాల్గొనడం, హల్‌చల్ చేయడం దుమారం రేపింది. దీనిపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి.. మంత్రి జూపల్లి ఎదుట తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిజామాబాద్ అర్బన్‌లో జరిగిన రోడ్డు శంకుస్థాపనలో ముఖ్య అతిథులతో కలిసి మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నరాల రత్నాకర్ పాల్గొనడం విశేషం.

ఆర్మూర్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యేతో పాటు వేదిక పంచుకున్న వినయ్‌రెడ్డి



# ఓడినోళ్లదే రాజ్యం

- అధికారిక ప్రోగ్రామ్‌లో అనధికార వ్యక్తులు
- జూపల్లి సాక్షిగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు
- ఆర్మూర్‌లో ఎమ్మెల్యేకు దీటుగా వేరే వ్యక్తికి మర్యాదలు
- బాల్కొండలోనూ హస్తం నేతల హల్‌చల్
- వత్తాసు పలికిన ప్రభుత్వ యంత్రాంగం

నిజామాబాద్, సెప్టెంబర్ 30, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రొటోకాల్ లేదు.. ఏం లేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కనీస మర్యాదా లేదు. ఉమ్మడి జిల్లాలో ఓడినోళ్లదే రాజ్యం అన్నట్లు నడుస్తున్నది. అధికార కార్యక్రమాల్లో అనధికార వ్యక్తులదే హవా కొనసాగుతున్నది. అధికార యంత్రాంగం సైతం నిబంధనలకు విరుద్ధంగా సాగే తంతుకు వత్తాసు పలుకుతున్నది. తాజాగా మంత్రి జూపల్లి నిజామాబాద్ జిల్లా పర్యటననే ఇందుకు నిదర్శనం. ప్రజల ఓట్లతో గెలిచినోళ్లను కావాలనే నిర్లక్ష్యానికి గురి చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వైనం విమర్శలకు తావిస్తున్నది. ఇన్‌చార్జి మంత్రి లేకలేక నిజామాబాద్ జిల్లా పర్యటనకు రాగా, ఆయన సమక్షంలోనే ప్రొటోకాల్ ఉల్లంఘన యథేచ్ఛగా జరిగింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఎదుటే ఈ తతంగం కొనసాగడం గమనార్హం.

### అయినా మారలే..

ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యేలు మొత్తుకుంటున్నారు. మొన్న జరిగిన దిశ సమావేశంలోనూ బీజేపీ ఎమ్మెల్యేలు రాకేశ్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఈ అంశాన్ని లేవనెత్తారు. అధికార కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ జిల్లా యంత్రాంగం తీరు మార్చుకోలేదు సరికదా మంత్రి పర్యటనలో అనధికార వ్యక్తులకు ఎర్ర తివాచీ పరవడం విమర్శలకు తావిచ్చింది. ప్రజాస్వామ్య విలువలపై ఊదరగొట్టే రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి.. తమ నాయకుల వ్యవహార శైలిపై మాత్రం నోరెత్తడం లేదు. ఎమ్మెల్యేలను కాదని అనధికార వ్యక్తులకు గులాంగిరి చేస్తున్న ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రొటోకాల్ ఉల్లంఘనలు..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బాల్కొండలో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్‌లో బీజేపీ నుంచి పోటీ చేసిన పైడి రాకేశ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వీరికి రాజ్యాంగబద్ధంగా ప్రొటోకాల్ ఇవ్వాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగడం లేదు. వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి చేతిలో ఓడిన సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డిలకే రాచమర్యాదలు దక్కుతున్నాయి. ఇందుకు సోమవారం నాటి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటనే ఉదాహరణ. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో సాక్షాత్తు కలెక్టర్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలోనే కాంగ్రెస్ నేతలకు పెద్దపీట వేశారు. ఓడినోళ్ల హవాలో ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన ఎమ్మెల్యేలు చిన్నబోవాల్సి వస్తున్నది. కాంగ్రెస్ నేతల అత్యుత్సాహంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సైతం అసంతృప్తితోనే ఉన్నారు. సోమవారం తన తల్లి ప్రథమ వర్ధంతి ఉండటంతో బాల్కొండలో జరిగిన జూపల్లి కార్యక్రమానికి హాజరు కాలేదు. మోర్తాడ్, భీమ్‌గల్‌లో ముత్యాల సునీల్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి తీరుపై ఆక్షేపణలు వెల్లువెత్తుతున్నాయి.

### దుమ్మా కొట్టిన నేతలు..

ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో జరిగిన అధికారిక కార్యక్రమాల్లో ప్రభుత్వ సలహాదారు హోదాలో షబ్బీర్ అలీ తళుక్కుమనగా, సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కనిపించక పోవడంపై సర్వత్రా చర్చ జరిగింది. మరోవైపు, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ సైతం తన సొంత నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమానికి దుమ్మా కొట్టారు. మరోవైపు, మంత్రి పదవి రాక కాస్త అసంతృప్తిగా ఉండడంతోనే బోధన్ ఎమ్మెల్యే.. మంత్రి పర్యటనకు రాలేదన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే, కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొనడంతో అనుమానాలకు తెరపడింది.



# రైతులను అడ్డుకోవడం సిగ్గుచేటు

మంత్రి జూపల్లికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న రైతు ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులు

- మాఫీపై మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు యత్నం
- ఐక్యకార్యాచరణ కమిటీని అడ్డుకున్న పోలీసులు
- మంత్రిని కలిసేందుకు ఆంక్షలా?
- ఆగ్రహం వ్యక్తం చేసిన కమిటీ ప్రతినిధులు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 30: జిల్లా పర్యటనకు వచ్చిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన రైతు ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులను పోలీసులు అడ్డుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆర్మూర్‌లో నిర్మించిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ భవనాన్ని ప్రారంభించేందుకు జూపల్లి సోమవారం వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనను కలిసి వినతి పత్రం ఇవ్వాలని రైతు జేఏసీ ప్రతినిధులు వెళ్లగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కాసేపు వాగ్వాదం జరిగింది. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే ఈ సర్కారులో.. రైతు సమస్యలపై మంత్రిని కలవడానికి వెళ్తుంటే అడ్డుకోవడమేమిటని కమిటీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు పోలీసులు ఐదుగురిని మాత్రమే అనుమతించగా, వారు వెళ్లి మంత్రికి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ విన్నవించారు. మంత్రిని కలిసిన అనంతరం కమిటీ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. రేషన్ కార్డు నిబంధన తొలగించి రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, రైతు భరోసా కింద రూ.7,500 చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులందరం ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని కమిటీ సభ్యులు ఇట్టెడి లింగారెడ్డి, దేగాం యాదగౌడ్, మంథని భూమారెడ్డి, సుక్కి సుధాకర్, మోతె చిన్నారెడ్డి హెచ్చరించారు.

# అటవీ భూములు కాపాడండి

- సీసీఎఫ్‌కు గౌరారం గ్రామస్తుల వినతి



అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ రాకేశ్ మోహన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గౌరారం గ్రామస్తులు

గాంధారి, సెప్టెంబర్ 30: ఆక్రమణకు గురైన అటవీ భూములను కాపాడాలని గాంధారి మండలం గౌరారం గ్రామస్తులు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) రాకేశ్ మోహన్ డోబ్రియాల్‌కు విన్నవించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీసీఎఫ్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామ శివారులోని అటవీ భూమిని కొందరు ఆక్రమించారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 150 ఎకరాలను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నట్లు వివరించారు. తమ గ్రామశివారులోని అటవీ భూమి సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేయడం ద్వారా భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఆక్రమణలపై డీఎఫ్‌వోకు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ విజ్ఞప్తిపై సీసీఎఫ్ సానుకూలంగా స్పందించారని, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారని గౌరారం గ్రామస్తులు తెలిపారు.

# రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



పప్పుల రాజేంద్రప్రసాద్

కామారెడ్డి,సెప్టెంబర్ 30: కామారెడ్డి జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బీబీపేట మండలం జనగామకు చెందిన పప్పుల రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం సోమవారం ఎన్నికలు నిర్వహించగా, సాయంత్రం ఫలితాలు వెల్లడించారు. ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాజేంద్రప్రసాద్, మాజీ అధ్యక్షుడు గౌరీశంకర్ అధ్యక్ష స్థానం కోసం పోటీ పడగా, మెజారిటీ సభ్యులు రాజేంద్రప్రసాద్ వైపే మొగ్గు చూపారు. మొత్తం 184 ఓట్లు పోలవ్వగా, ఆయనకు 121 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన గెలుపొందినట్లు ప్రకటించారు. ఖాళీ కానున్న ప్రధాన కార్యదర్శి స్థానానికి త్వరలోనే ఎన్నిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

# విద్య, వైద్యానికి ప్రాధాన్యం




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- పనితీరు మెరుగుపరుస్తాం
- రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం
- పాలిటెక్నిక్ కాలేజీ 'ఇంజినీరింగ్'గా అప్‌గ్రేడ్
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

30: విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పనితీరులో స్పష్టమైన మార్పు తీసుకొస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఆర్మూర్, భీమ్‌గల్, మోర్తాడ్‌లో నూతనంగా నిర్మించిన ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ భవనాలను ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీ తప్పకుండా చేస్తామన్న మంత్రి.. జిల్లాలో 71 వేల కుటుంబాలకు రూ.626 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించామన్నారు. పాలిటెక్నిక్ కళాశాలని ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించారు.

**బెల్ట్ షాపులపై చర్యలు..**

మాదక ద్రవ్యాల అడ్రస్ కనిపించకూడదని ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలు గ్రామాలకు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కల్లులో కలిపే ఆల్ఫాజోలం లాంటి పదార్థాల సరఫరాను నియంత్రించాలని ఆదేశించినట్లు చెప్పారు. బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ హందాన్, సహకార శాఖ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



నాగన్నబావికి పర్యాటకుల తాకిడి పెరిగింది. చారిత్రక వైభవమున్న ఈ మెట్లబావి శిథిలావస్థకు చేరగా, దాన్ని పునరుద్ధరించి ఇటీవలే ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. పిట్లం విద్యార్థులు బావిని సందర్శించారు. – నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 30

# సీపీ సీటుకు ఎసరు?

- బదిలీ చేయాలని సర్కారుపై కాంగ్రెస్ నేతల ఒత్తిడి
- మాట వినడం లేదని సీఎంకు ఫిర్యాదులు
- బదిలీకి రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం

నిజామాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనావర్ బదిలీ కానున్నట్లు ప్రచారం జరుగుతున్నది. తాము చెప్పిన మాట వినడం లేదని, బదిలీల విషయంలోనూ సహకరించడం లేదని కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీపీని ట్రాన్స్‌ఫర్ చేయాలని నేతలు సీఎంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయన బదిలీకి రంగం సిద్ధమైనట్లు సమాచారం. అయితే, రెండు నెలల క్రితం కూడా సీపీని కదుపుతారని జోరుగా ప్రచారం జరిగింది. కానీ, అనూహ్యంగా కల్మేశ్వర్ భార్య ప్రియదర్శినిని 7వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించడంతో ఆ ప్రచారానికి బ్రేక్ పడింది. తాజాగా మరోసారి బదిలీ అంశం తెరపైకి వచ్చింది.



**నిక్కచ్చిగా..**

ముక్కుసూటి మనిషిగా, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా వ్యవహరిస్తున్న సీపీ తీరు కొందరు నేతలకు నచ్చడం లేదు. పలు సందర్భాల్లో కీలక నేతల మాటలను ఆయన పక్కన పెట్టడం వారిని ఆగ్రహానికి గురి చేసింది. ఈ నేపథ్యంలోనే ఆయన మాకు వద్దే వద్దంటూ ప్రభుత్వ పెద్దలకు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నారు.

**సీఎం ఆదేశాలు బేఖాతరు..**

సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు, క్షేత్ర స్థాయిలో చేతలకు భారీ తేడా కనిపిస్తున్నది. సిఫార్సు లేఖలతో వస్తే పోస్టింగ్‌లు ఇవ్వొద్దని ఆదేశించారు. అదే పనిని పోలీస్ ఉన్నతాధికారులు చేపడితే కాంగ్రెస్ నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఐపీఎస్ అధికారులతో గొడవకు దిగుతున్న ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. ఈ మధ్య జరిగిన ఎస్సై, సీఐ బదిలీల వ్యవహారమే ఇందుకు నిదర్శనం. రూరల్ నియోజకవర్గంలోని ఎస్సైలు, సీఐలకు పోస్టింగ్ విషయాల్లో ఉత్తర్వులు జారీకాగా, అవి అమలు కాలేదు. ఆర్మూర్, భీమ్‌గల్ సీఐల మార్పు విషయంలోనూ ఇదే జరిగింది. గంటల్లో ఉత్తర్వులు మారాయి. ఇది అధికార పార్టీ నేతల్లో మంట రాజేసింది. నెల క్రితం కూడా నలుగురు సీఐలకు స్థాన చలనం కాగా, రాత్రికి రాత్రే ఉత్తర్వులు ఆగిపోయాయి. మూడు రోజుల క్రితం అవే ఉత్తర్వులను తేదీ మార్చుతూ అమలు చేయడం ముక్కున వేలేసుకునేలా చేసింది. ఇందులో ఒకరిద్దరిపై తీవ్రమైన ఆరోపణలున్నప్పటికీ కీలకమైన పోస్టింగ్‌లు దక్కడం చర్చకు దారి తీసింది. రూరల్ నియోజకవర్గంలో ఓ మండల స్థాయి నాయకుడి వాహనాన్ని పట్టుకోగా విడిచిపెట్టాలంటూ పెద్దల నుంచి ఫోన్లు వచ్చినా పోలీసులు విడిచి పెట్టలేదు. మోపాల్‌లో ఓ ప్రజాప్రతినిధి ట్రాక్టర్ల ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కువ వాహనాలను అనుమతించేది లేదంటూ స్పష్టం చేశారు. ఆయా ఘటనలతో కంగుతిన్న నేతలు సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫలితంగా సీపీని బదిలీ చేసేందుకు ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. మరోవైపు పోలీస్ బాస్‌కు ఓ ప్రజాప్రతినిధి అండగా నిలుస్తుండగా, మరో నాయకుడు బదిలీ చేయాల్సిందేనని పట్టుబడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.